# హ్యాపీ యానివర్సరీ

'భానూ... గుడ్‌మార్నింగ్... హ్యాపీ యానివర్సరీ..' ఎవరో నా చెవుల్లో అమృతం కురిపిస్తున్నట్టు వినిపించింది. చటుక్కున కళ్లు తెరిచాను. ఎదురుగా లేత నీలంరంగు బల్బు వెలుగుతోన్న ప్రిన్సెస్ బొమ్మ కనిపించింది. నా చూపులు చకచకా చుట్టూ తిరిగాయి. నేనెక్కడ ఉన్నాను... లేత చేతులు నా మెడచుట్టూ పెనవేసి నా గుండెల్లో గువ్వలా ఒదిగి పడుకున్న నా బంగారు మెత్తని స్పర్శ... ఒక్కసారిగా దిగులు కమ్మేసింది. ఆ పిలుపు, ఆ కమ్మటి స్వరం నిజం కాదు... నా భ్రాంతి... ఇప్పుడు నా పక్కన ఉన్నది నా చిట్టితల్లే... నా ప్రాణానికి ప్రాణమే... కానీ, ఈ రోజు... ఈరోజు... నాకు ఆయన స్పర్శ కావాలి... ఆయన సాన్నిహిత్యం కావాలి... ఇవాళ మా పెళ్లిరోజు. మా పెళ్లి అయి ఇవాల్టికి ముప్ఫై ఏళ్లు. ఇండియా లో ఉండి ఉంటే సరదాగా సెలబ్రేట్ చేసుకునేవాళ్లం.

నా బంగారు వైపు చూశాను. చిరు వెలుగులో పచ్చని అందమైన మొహంలో ఎంతో తృప్తి... మరెంతో నిశ్చింత. అమ్మమ్మ దగ్గర పడుకున్నానన్న ధైర్యం... వాత్సల్యం వెల్లువలా వచ్చింది. ఎడంచేత్తో తన నుదుటి మీద చిందరవందరగా పడిన ముంగురులు సవరించి తనకి నిద్రాభంగం కలక్కుండా నెమ్మదిగా చేతులు తొలగించి పక్కకి జరిపి నామీదకు పడిన కంఫర్టర్ తీసి తనకి పూర్తిగా కప్పాను. కంఫర్టర్ తొలగించగానే చలి తీవ్రత అర్థమైంది. అదే అక్కడ ఆయన పక్కన అయితే ఈ చలిలో మంచం మీంచి దిగేదాన్నా... ఆయన కౌగిలి వదిలేదాన్నా. అందులోనూ ఇవాళ. నిట్టూర్చి నెమ్మదిగా మంచం దిగాను.

మంచం దిగ్గానే మెత్తటి కార్పెట్. అడుగు దూరంలో వదిలిన స్లిప్పర్స్ తొడుక్కుని రెస్ట్‌రూమ్‌కి వెళ్లాను. చలి... చలి. ఎముకల్ని కొరికే చలి అంటే ఏమిటో ఈ అమెరికా వచ్చాకే అర్థమవుతోంది. రెస్ట్‌రూమ్‌కి ఆనుకొని ఉన్న క్లోసెట్ హాంగర్‌కి తగిలించి ఉన్న కోటు తీసి తొడుక్కున్నాను. టైం ఎంత అయిందో... పొడుగాటి కిటికీ దగ్గరగా నడిచి కిటికీ కర్టెన్ పక్కకి జరిపి అద్దాల్లోంచి బైటకి చూశాను.

స్ప్రింక్లర్స్ ఆన్ అయినట్టున్నాయి... లాన్‌లో జల్లు కురుస్తున్నట్టుగా అనిపిస్తోంది... ఇప్పుడు సమయం ఐదున్నర... నేను లేవడం స్ప్రింక్లర్స్ ఆన్ అవడం నిత్యకృత్యమే... నాకు అటు సూర్యుడు ఎటు పొడిచినా ఠంచనుగా మెలకువ వస్తుంది. ఇవాళ శనివారం... వీకెండ్... పిల్లలు ఎలాగా త్వరగా లేవరు... పాపం! ఉరుకులు, పరుగుల జీవితం... యాంత్రికమైన దినచర్య... ప్రతిరోజూ వాళ్ల జీవన విధానం ఒకలా ఉంటుంది. వీకెండ్ అయితే మాత్రమే నిశ్చింతగా కాస్సేపు నిద్రపోతారు. రోజూ నేను ముందులేచి వాళ్లకి కావలసిన బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేసి, ముగ్గురికీ క్యారియర్లు సర్దుతాను... వాళ్లు లేచి వాళ్ల పనులు, స్నానాలు అన్నీ పూర్తి చేసుకొని వచ్చి ఎవరి క్యారేజీ వాళ్లు తీసుకుని పరుగులు పెడతారు. నేనూ, ఈ నాలుగు గోడలూ మిగులుతాము.

చలి చెవుల్లోంచి ప్రవహిస్తున్నట్టు అనిపిస్తోంది. స్కార్ఫ్ కట్టుకోవాలి. కిందకు వెళ్లనా? బైటకి చూశాను... ఇంకా చీకటిగానే ఉంది. స్ట్రీట్ లైట్ వెలుగులో నిశ్శబ్దంగా ఉన్న ఇళ్లు అందంగా, కళాత్మకంగా కనిపిస్తున్నాయి. నిర్మలమైన ఆకాశంలో పూర్ణచంద్రుడు... వెన్నెల ప్రకాశవంతంగా చూపిస్తోంది పరిసరాలను. వెన్నెల ఎంతో అందంగా చూపిస్తోంది పచ్చని పచ్చికను. ఎంత బాగుందో... నేను గమనించలేదు కానీ, ఎంత వెన్నెల... పున్నమి కదా... పచ్చని లాన్ మీద, పూలమొక్కల మీద, ఓక్ చెట్ల మీదా, ఇంటి కప్పుల మీదా, లాన్‌లో క్రిస్‌మస్ సందర్భంగా అమెరికన్ లేడీస్ అలంకరించుకున్న రకరకాల బొమ్మల మీదా... ఎక్కడ చూసినా వెన్నెల.

రాధ కొన్న ఈ కొత్తింటికి వచ్చాక కాస్త బైట వాతావరణం కనిపిస్తోంది. అడపా దడపా తిరిగే మనుషులు, కార్లు, ఎదురిల్లు, పక్కిల్లు, ఆ పక్కిల్లు, ప్రతి ఇంటిముందూ క్రమ పద్ధతిలో పెంచిన లాన్, పూలమొక్కలు, ఓక్ చెట్లు, సోలార్ లైట్లు... ఆ ఇళ్లలోంచి మధ్యమధ్య బైటకి వచ్చి ఎండలో తిరుగుతూ టాన్ అవడానికి ప్రయత్నించే అమెరికన్ అమ్మాయిలు... ఇవన్నీ అద్దాల కిటికీలోంచి చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను. లేకపోతే పిచ్చెక్కిపోయేది.

మొదటిసారి ఇక్కడికి వచ్చినపుడు కొన్ని రోజులు బాగానే ఉంది. పాపాయి పుట్టడం, దాని ఆలనా, పాలనా, టైం ఎలా గడిచిందో కూడా అర్థం కాలేదు. మధ్యమధ్య వీకెండ్స్ అమెరికా అందాలు చూడడం, నాలుగు నెలలు గడవగానే ఇండియా మీద, ఆయన మీదా, నా ఇంటి మీదా బెంగ ముంచుకొచ్చేసింది. మరో రెండు నెలలు అతి కష్టం మీద గడిపి ఆయన దగ్గరకు ఎగిరి వెళ్లాను.

వెళ్లగానే ఎయిర్‌పోర్ట్‌లోనే ఆయన చేయి గట్టిగా పట్టుకుని 'ఇంకెప్పుడు అమెరికా వెళ్లను. నా వల్లకాదు, మీకు దూరంగా ఉండడం' అన్నాను. ఆయన మనోహరంగా నవ్వారు. 'అలాగే నేను వెళ్లమననులే' అన్నారు. ఆయనలా ఎందుకన్నారో తర్వాత తెలిసింది. మరో ఆరు నెలలు కాగానే 'ఏవండీ నా బంగారు ఎలా ఉందో... దిక్కుమాలిన క్రచ్‌లో వేశారు. అమ్మమ్మ ఒడిలా ఉంటుందా క్రచ్...' అన్నాను బెంగగా. మరునాడే రాధ నుంచి ఫోన్... 'అమ్మా... పాపాయిని కేర్‌లో వేస్తే తరచూ జలుబు, జ్వరం వస్తున్నాయి. డాక్టర్లకి బోలెడవుతోంది. నువ్వేం చేస్తా వక్కడ? వచ్చేసేయ్. టికెట్ కొంటాను' అని. అంతే నా మనసుకి మళ్లీ రెక్క లొచ్చాయి.

ఏమిటో అమెరికా అనగానే భూలోక స్వర్గంలా ఎందుకు భావిస్తారో అర్థం కాదు. వీసా వచ్చిందాకా దిగులే... చిన్నప్పుడు చూసిన జానపద సినిమాల్లో పాతాళలోకం వెళ్లడానికి రాజకుమారుడు పడే పాట్లన్నీ అమెరికా వెళ్లడానికి పడుతున్నట్టుగా అనిపించింది. వీసా వస్తుందా? లేదా? స్టాంపింగ్ అవుతుందా, లేదా? అని ఒకటే దిగులు... 'అమ్మా వాళ్లు ఇలా అడుగుతారు, అలా చెప్పు' అంటూ ఫోన్‌లో రాధ కౌన్సెలింగ్. వీసా కోసం వెళ్లినపుడు జరిగే ఇంటర్వ్యూ తతంగం మొత్తం నోట్స్‌లా రాసి పంపించింది. అదంతా బట్టీ పట్టడం, దేవుడా నాకు స్టాంపింగ్ అవాలి... నీకు 108 ప్రదక్షిణలు చేస్తాను... అని దేవుణ్ని మొక్కుకోడం, ఇప్పుడు తల్చుకుంటే నవ్వొస్తోంది. ఈ సెంట్రల్ జైలుకి రావడానికి ఎంత ఫార్సు జరిగింది. తీరా వచ్చాక ఇక్కడ జీవితం విజిటర్స్‌గా వచ్చే పేరెంట్స్‌కి జైలు జీవితం అని పూర్తిగా అర్థమైంది.

పిల్లలు బైటకి వెళ్లిపోయాక వాళ్లొచ్చిందాకా నోరు టేపు వేసి అతికించినట్టే... మాటలు మరిచిపోయినట్టే.. మొదట్లో భయమేసింది ఇండియా వెళ్లాక మళ్లీ పెద్ద బాలశిక్ష చదువుకోవాలేమో అని. ఆ అవసరం లేకుండా ఆయన బోలెడు కబుర్లు చెప్పారు. చెప్పించారు. ఆరు నెలలు కడుపులో దాచుకున్న అనురాగం... ప్రేమా, మాటల రూపంలో ప్రవాహంలా నన్ను ముంచెత్తింది... అప్పుడు మళ్లీ అన్నాను. ఆయన గుండెల్లో ఒదిగిపోతూ... 'ఇంకెప్పుడూ వెళ్లనండి... మీరు లేకుండా నేనుండలేను' అదే నవ్వు నవ్వారు. 'ఎందుకలా నవ్వుతారు? ఈసారి వెళ్లడం అంటూ జరిగితే మీతో కలిసే... మీరు వాలంటరీ తీసేసుకోండి. నావల్ల కాదు. ఏడాదికి ఆరునెలలు మిమ్మల్ని వదిలి ఎలా ఉండగలననుకున్నారు?' ఉక్రోషంగా అన్నాను.

'నేను మాత్రం ఉండగలనా నినొన్నదిలి...కానీ, ఏం చేస్తాం? పిల్లలు అక్కడ ఇబ్బందిపడుతోంటే మనం ఇక్కడ ఎంజాయ్ చేయగలమా?' చెళ్లున తగిలింది... అవును నిజమే చేయగలమా?

నిజం చెప్పాలంటే మా దాంపత్య జీవితం మూడుపూలు ఆరు కాయలుగానే సాగింది... సాగుతోంది. అనుకూలమైన, అన్యోన్యమైన జీవితం... సరదాకి కూడా పోట్లాడు కోలేదు. ఇద్దరి అభిరుచులు ఒకటే... ఇద్దరి రుచులు ఒకటే, ఇద్దరి అభిప్రాయలు ఒకటే, ఆలోచనలు ఒకటే... ఆశయాలూ ఒకటే. అందుకే ఎన్నడూ చిన్నచిన్న అభిప్రాయ భేదాలు కూడా లేని జీవితం మాది.

సాధారణంగా పిల్లలు పుట్టగానే దాంపత్య జీవితం చాలామందికి రొటీన్ అవుతుంది. కానీ రాధకి పదేళ్లు వచ్చిందాకా మా దాంపత్య జీవితం మాకు ప్రతి రాత్రి మొదటి రాత్రిలాగే గడిచేది. రాధ పెద్దదవుతోందని మా అంతట మేమే నిశ్చయించుకొని కొంచెం ఆవేశాలను, కోరికలను అణచుకున్నాం. అలాగని మామధ్య శారీరకంగా గానీ, మానసికంగా గానీ ఎలాంటి గ్యాప్‌లేదు. రాధ పెళ్లి అయాక సెకండ్ ఇన్నింగ్ స్టార్ట్ చేద్దాం అంటూ ఆయన చిలిపిగా కన్ను గీటుతుంటే ఆ చర్యలోని అల్లరితో మైకం కమ్మినట్టు అయి పులకించిపోయేదాన్ని...

ఒక్కతే కూతురు... మా ఆశలకీ, అభిరుచులకీ అనుగుణంగా పెంచి, పెద్ద చేసి మంచి చదువు చెప్పించి, మంచి ఉద్యోగం చూపించి, మంచి కుటుంబా నికి కోడలిగా, మంచి వ్యక్తికి భార్యగా చేసి మా బాధ్యత పూర్తిగా నెరవేర్చుకున్నాం... రాధ అమెరికా వెళ్లాలన్న ఆలోచన, ఆశ మాకెప్పుడూ లేదు. అత్తగారు, మావగారి దగ్గర హాయిగా ఉంటూ వాళ్లల్లో కలిసిపోయి చక్కటి కుటుంబ జీవితం గడపాలను కున్నాను. పుట్టే పిల్లలకి నానమ్మ, తాతయ్యల ప్రేమ అక్కడ, అమ్మమ్మ, తాతయ్యల ప్రేమ ఇక్కడ లభించాలని నేటి సోకాల్డ్ సొసైటీ ప్రభావం తన పిల్లల మీద పడకుండా కమ్మని కథలతో పిల్లలు నిద్రపోవాలని ఎన్నో అనుకున్నాను. కానీ, హఠాత్తుగా రాధ 'అమ్మా మేము అమెరికా వెళ్తున్నాం. నాకు హెచ్ వన్ వీసా వచ్చింది' అనగానే నిశ్చేష్టురాల్ని అయాను. అంతదూరం మాకు దూరంగా ఎందుకు వెళ్తోందో అర్థంకాలేదు. ఏం తక్కువైందని తనకి... మంచి ఉద్యోగం, అల్లుడికి అంతకన్నా మంచి ఉద్యోగం. మా నుంచి తనకి లభించే ఆస్తి, అత్తగా రింట్లో ఆస్తిపాస్తులు ఇంకా ఏంకావాలి? దేనికి ఈ పరుగు అనిపించింది. కానీ, వాళ్ల స్వాతంత్ర్యాన్ని ఆపే హక్కు మనకి లేదు. అని ఆయన నన్ను ఆపడంతో నేను ఎదురు చెప్పలేదు. కన్నీళ్లతోటే పంపించాను. గుండె బరువైంది. ఒకే ఒక్క

కూతురు... దానికి పుట్టే పిల్లలతో ఆడుకుంటూ ఆ ముద్దు మురిపాలు అనుభవించి పరిపూర్ణమైన జీవితం అనుభవించిన ఆనందంతో హాయిగా కళ్లు మూయవచ్చు అనుకున్నాను.

ఇప్పుడు కూడా నేను అనుకున్న జీవితం అనుభవిస్తూనే ఉన్నాను. మా ఇద్దరి మధ్యా అదే అన్యోన్యత... అదే అనురాగం. మా జీవితాల్లో అదే చైతన్యం, అదే రసానుభూతి. ఒక స్త్రీగా, మాతృమూర్తిగా పరిపూర్ణత చేకూరుస్తూ మనవ రాలి ఆగమనం... కానీ, తేడా... చిన్న తేడా... చిన్నదేం కాదు... పెద్దదే. చాలా పెద్దది. అక్కడ నా జీవితం నిత్య చైతన్య ప్రవంతి. ఇక్కడ నా జీవితం ఘనీభవించిన మంచు. ఈ కూతురు, ఈ అల్లుడు, ఈ మనవరాలు అక్కడ ఉంటే ఈ ఆనందాన్ని, పాపాయితో పొందే మధురానుభూతుల్ని ఆయనతో కలిసిపొందే ఆనందం వేరు. అది ఎన్నివేల డాలర్లు వెచ్చించినా లభించదు.

ఇప్పుడు చిత్రంగా ఏదో మార్పు నాలోనే, నా ప్రేమలోనే... నా ప్రేమ ఇదివరకు రెండు భాగాలు... ఇప్పుడు నాలుగు భాగాలైంది. అందులో ఎక్కువ వాటా నా బంగారుకి... అందుకేనేమో ఆరునెలలు దాటగానే, ఇరుకు సీట్లో 18 గంటల విమాన ప్రయాణం, స్వేచ్ఛలేని అమెరికా జైలు జీవితం, పలకరింపుకి నోచుకోని మౌన జీవితం, జడత్వంతో నిండిన దినచర్య... ఏవీ నన్ను నిరోధించవు. ఆయన కళ్లల్లో లీలా మాత్రంగా కనిపించి మాయమయే దిగులు, ఆయన సాన్నిధ్యంలో నేను పొందే మహత్తరమైన అనుభవం ఏవీ నన్ను ఆపవు. ఆరునెలలు దాటగానే పాపాయి నవ్వు, పాపాయి అల్లరి నన్ను అమెరికా లాక్కెళ్లిపోతాయి. అలా వచ్చేటప్పుడు మా పెళ్లిరోజులు, పుట్టినరోజులు, వెన్నెల రాత్రులు, శృంగార జీవితం నన్నేదీ ఆపదు. కానీ, రాగానే మళ్లీ చైతన్యం ఘనీభవిస్తుంది. నిత్యం ఆయనతో మాట్లాడే నా మాటల్లో చిలిపితనం పోయి ఫోన్‌లో పాపాయి అల్లరి, పాపాయి కబుర్లు దొర్లుతాయి.

'ఏంటిది? ఇంతేనా జీవితం...' గుండెల్ని చీల్చుకుంటూ దీర్ఘమైన నిట్టూర్పు వచ్చింది.

నా కళ్లు మళ్లీ వెన్నెల్లో తడుస్తున్న ప్రకృతి వైపు తిరిగాయి. ఆలోచనలు మనసునిండా కదం తొక్కుతుంటే కళ్లముందు కాస్సేపు శూన్యం కనిపిస్తుందేమో... ఇప్పటిదాకా కను మరుగైన వెన్నెల అందం మళ్లీ నా గుండె పొరల్ని తాకింది. ధారలుగా కారుతూ, తన తేజాన్ని, తన చల్లదనాన్ని ప్రకృతి మీద వెదజల్లుతూ, విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పడుతోంది. అమాంతం వెళ్లి ఆ వెన్నెల్లో స్నానం

చేయాలనిపించింది. పరిగెత్తుకుంటూ వెళ్లి దోసిళ్లతో ఆ వెన్నెల పట్టుకుని తాగాలని పిస్తోంది.

వెన్నెలంటే మా ఇద్దరికీ ఎంతో ఇష్టం. ప్రతి పున్నమినాడూ డాబా మీద కూర్చుని కబుర్లు చెప్పుకోడం మా జీవితాల్లో ముప్ఫైఏళ్ల నుంచీ వస్తున్న రివాజు. మా శృంగార జీవితంలో ఒక మధురమైన అనుభూతి. అలాంటి వెన్నెల రాత్రుల్లో ఆయన నా చేత ఎన్ని వెన్నెల పాటలు పాడించుకుని వింటారో... వెన్నెలలోని వికాసమే వెలిగించెద నీ కనులా... ఈ వెన్నెల ఈ పున్నమి వెన్నెల ఈనాడూ, ఆనాడూ ఒకే వెన్నెల.... కృష్ణశాస్త్రి గారి పాట... ఆ వెన్నెల పాట... జల్లులు జల్లులుగా గుండెల్లో కురిపిస్తూ నేను పాడుతోంటే ఆయన ఎంత తమకంతో వినేవారు. రెల్లుపూల పానుపుపైన జల్లు, జల్లులుగా ఎవరో చల్లినారమ్మా... నాకక్కడ ఇంక క్షణం కూడా నిలవాలనిపించలేదు. నాకూ, వెన్నెలకీ మధ్య పారదర్శకంగా ఉన్న గాజు కిటికీ అభేద్యమైన గోడలా అనిపించింది.

సవ్వడి చేయకుండా బైటకి వచ్చాను. అడుగులో అడుగు వేసుకుంటూ కిందకి దిగి వచ్చి స్టాండ్ మీద ఉన్న కార్డ్‌లెస్ చేతిలోకి తీసుకుని బ్యాక్ యార్డ్ వైపు నడిచాను. సెక్యూరిటీ నెంబరు నొక్కి డోర్ తీసి బైటకి వెళ్లి గార్డెన్ చెయిర్‌లో కూర్చున్నాను. చల్లగా, హాయిగా ఉంది. వెన్నెల బంతిలా మారి నా ఒళ్లో పడినట్టు అనిపించింది.

ఆయన ఆఫీసు నుంచి వచ్చి ఉంటారు... ఫోన్ చేసి శుభాకాంక్షలన్నా చెప్పాలి కదా! ఆయన నాకు శుభాకాంక్షలతోటే సుప్రభాతం పాడారు. ఎంత దూరం ఉంటే ఏం? ఆయన ప్రేమ, ఆయన అనురాగం నన్ను నీడలా వెంటాడు తూనే ఉంటాయి. అందుకు హ్యాపీ యానివర్సరీ అంటూ చెవిలో ఆయన ఊదిన శంఖమే నిదర్శనం.

మా పెళ్లిరోజు రాధకి గుర్తులేదు. ఉండి ఉంటే నిన్న రాత్రే హడావుడి చేసేది. అర్ధరాత్రి కేక్ కట్ చేయించి, ఆ సన్నివేశాన్ని తండ్రికి స్కైపులో చూపిస్తూ, తనూ, భర్తా, కూతురూ మా ఇద్దరికీ శుభాకాంక్షలు చెప్తూ... ఎన్ని శుభాకాంక్షలు చెప్పినా, ఎంత పెద్ద కేకు కట్ చేయించినా కంప్యూటర్‌లో ఆయనకి చూపించినా మేమిద్దరం కలిసి ఈ వెన్నెల రాత్రిని, వెన్నెల పాటలతో గడిపే ఆ మధురమైన సన్నివేశాన్ని ఆస్వాదించగలమా? రాధ అమెరికా రావడం వల్ల, పాపాయి పుట్టడం వల్ల మేము ఇలా ఏడాదికి ఆరునెలలు వియోగంతో బాధపడుతున్నాం కానీ, ఎప్పుడైనా మేము ఇంతకాలం ఒకళ్లని వదిలి ఒకళ్లు ఉన్నామా? నెవ్వర్... ఎంత

మంది కుంటుంది మా దాంపత్యంలాంటి దాంపత్యం. ఉండదుగాక ఉండదు. నేను ఇలా వస్తున్నందుకు ఆయన ఎంత బాధపడుతున్నారో ఆలోచించే వ్యవధి కూడా లేకుండా వచ్చేస్తున్నాను. ఆరునెలలు ఎంతలో గడుస్తుంది? అందులోనూ ఆయన సాన్నిధ్యంలో తిరిగి చూసేలోగా మళ్లీ షాపింగులు, సూట్‌కేసులు సర్దుకోడం, బరువులు చూసుకోడం ఎయిర్‌పోర్టు, ఇరుకు సీటు. పికప్‌లు, డ్రాపింగులు... ఏంటీ జీవితం? ఇంతేనా ఇంక... నాకు చాలా బెంగగా అనిపించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ నేనింక రాకూడదు ఇక్కడికి... ఇప్పటికే ఆయనకి చాలా అన్యాయం చేశాను. ఎంత పిల్లలైతే మాత్రం భర్తని నిర్లక్ష్యం చేసేంత మాతృప్రేమ అవసరమా? నో అంతగా అయితే పాపాయిని నాతో తీసికెళ్లిపోతాను. కానీ, ఆయన్ని వదిలి మాత్రం ఇంక వచ్చేది లేదు.

తమాషా ఏంటంటే మా మధ్య ఇటీవల తరచూ ఏర్పడుతున్న ఈ దూరం దెబ్బలాటలతో కానీ, అభిప్రాయ భేదాలతో కానీ ఏర్పడింది కాదు కాబట్టి ఇంత దూరంలోనూ మామధ్య చిలిపి కబుర్లు, తీయని అనుభూతుల నెమరివేతలు... ఫోన్ ద్వారా, ఇంటర్‌నెట్ ద్వారా జరుగుతూనే ఉన్నాయి. మా మనసుల్లో ప్రేమ పుష్పాలు నవనవలాడుతూనే ఉన్నాయి. కానీ, ఇలా ఎంత కాలం?

ఆయన రిటైర్ అవడానికి ఇంకా రెండేళ్లు. ఆ తరువాత ఇద్దరూ రావచ్చు. వచ్చినా ఆయన ఇంత యాంత్రికతను భరించలేరు. ఆయనకి జీవితం ఒక చైతన్యవాహికలా ఉండాలి. ఆయనలోని భావుకత, రసికత, చలాకీతనం ఆయన్నిక్కడ నిర్వీర్యం చేస్తుంది. ఒక్కసారి ఇక్కడకు వచ్చి నా పరిస్థితి చూసి నన్ను మళ్లీ పంపిస్తారా లేదా అని కూడా నాకు అనుమానమే. ఈ జీవన విధానం ఆయనకి ఎంతమాత్రం నచ్చదు. నన్నేకాదు, పిల్లల్ని కూడా ఉండనివ్వరు. కానీ, వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండియా రారు. వాళ్లకి ఇక్కడే బాగుంది. కానీ నాకు ఇండిచానే బాగుంది. ఇదే జనరేషన్ గ్యాప్‌లో ఉన్న అభిరుచుల తేడా. అక్కడ ఉన్న స్వేచ్ఛ నాకిక్కడేది? ఇండియాలో లంచగొండితనం పెరిగిపోనీ, ఇండియాలో పొల్యూషన్ పెరిగిపోనీ, ఇండియాలో మోసాలు, దగా, దొంగతనాలు, సామాజిక అలజడి, ఏమన్నా ఉండనీ, నా ఇండియా ఇండియానే... అక్కడ ఎన్నో సౌకర్యాలున్నాయి.. అక్కడ నావాళ్లు అనేవాళ్లు ఉన్నారు. నా జీవితాన్ని సుఖంగా, ప్రశాంతంగా, రసవత్తరంగా గడిపే అవకాశం నాకెంతగానో వుంది. రెక్కలుంటే ఎంత బాగుండేది... ఈ ఒక్కరోజు నా భర్త దగ్గరకు వెళ్లి ఇరవైనాలుగు గంటల్లో ఇరవైనాలుగు సంవత్సరాల అనుభూతిని మూటగట్టుకుని వచ్చేదాన్ని.

ఏవండీ... దుఃఖం వచ్చింది. ఫోన్ చేయాలి. మాట్లాడాలి. ఆయన స్వరం వినాలి. కార్డ్‌లెస్ తీసుకుని నెంబరు కలిపాను... ఆయన వెంటనే లైన్లోకి వచ్చారు.

'హ్యాపీ యానివర్సరీ... నువ్వు లేచావో లేదో అని ఫోన్ చేయాలనిపించినా చేయలేదు...' ఆయన స్వరం వినిపించగానే కళ్లమ్మట నీళ్లు తిరిగాయి.

'థాంక్యూ... థాంక్యూ... ఎలా ఉన్నారు?" అడిగాను.

"చెప్పనా?"

"చెప్పండి"

"బాధపడనంటే చెప్తా"

"చెప్పండి"

"గడ్డం పెరిగింది... షేవ్ చేసుకోవాలంటే నిర్లిప్తత. ఎవరికోసం చేసుకోవాలి? ఆకలేస్తోంది... తినడానికి ఏమీ లేదు. నువ్వంటే బజ్జీలు వేసిచ్చే దానివి కదా...నాకు నువ్వు చేసి పెట్టే పెరుగు గారెలు తినాలని ఉంది. తినలేను. హోటల్లో తిందామన్నా... అవి నువ్వు చేసినవి కావుగా... సినిమా చూడాలని ఉంది... నీతో చూడ్డం అలవాటయాక ఒంటరిగా వెళ్లాలని లేదు. అవునూ మన పుట్టినరోజులకి కనీసం కేక్ కట్ చేయించి నిన్ను ఇంటర్‌నెట్‌లో చూపించేవాళ్లు. శుభాకాంక్షలు చెప్పేవాళ్లుగా పిల్లలు. రాత్రి ఎదురు చూశాను చేస్తావని... ఏం? ఎందుకు చేయలేదు?"

దుఃఖం అడ్డుపడింది... సమాధానం చెప్పలేకపోయాను.

"భానూ... వాట్ హాపెండ్?" మృదువుగా అడిగారు.

సన్నగా ఏడుపు వినిపించినట్టుంది... అరరే... డోంట్ బి సో ఎమోషనల్... వాళ్లకి తెలిస్తే బాధపడతారు. చిన్న విషయం, బాధపడకు. అయినా మనకింకా పెళ్లి రోజులేంటి? పెద్దవాళ్లం అయాము. పిల్లల సంతోషమే మన సంతోషం. వాళ్ల ఆనందమే మన ఆనందం. ఊరుకో, అన్నట్టు నీకో విషయం చెప్పాలి... నిన్న నువ్వు చేసినట్టు పొటాటో ఫ్రై చేద్దామని ట్రై చేశాను. ముక్కల్ని బొగ్గులుగా మార్చాను. నెక్ట్స్ టైమ్ రాధ డెలివరీకి వెళ్లేటప్పుడు బాబుకి సాంబ్రాణి పొగ వేయడానికి అవి పట్టికెళ్లచ్చు." ఆయన నవ్వు నాకు జలతరంగిణీ ధ్వనిలా అనిపిస్తుంది. కానీ... ఇప్పుడు సంగీత జ్ఞానంలేని వ్యక్తి చేతిలో మోగుతున్న సంగీత వాయిద్యంలా అనిపిస్తోంది.

"ఏవండీ నేను... ఇంక ఉండలేను... వచ్చేస్తాను. అయామ్ మిస్సింగ్

యూ” అన్నాను బేలగా.

“నువ్వలా అంటోంటే మన పెళ్లి అయిన కొత్తలో మీ పుట్టింటికి వెళ్లి రెండో రోజే పరిగెత్తుకొచ్చిన సంఘటన గుర్తొస్తోంది...”

“ప్లీజ్... సీరియస్‌గా చెప్తున్నాను... నేనిక్కడ వాళ్లకి పెద్ద చేసేదేం లేదు... నేను లేకపోతే వాళ్లు వారానికోసారి వండుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుంటారు. పెద్ద పని కూడా పెట్టుకోరు. బంగారుని సాయంత్రం దాకా స్కూల్లోనే ఏవో యాక్టివిటీస్‌లో చేర్పిస్తారు. పిల్లలిద్దరూ ఇళ్లకు వెళ్లేటప్పుడు దాన్ని పికప్ చేసుకుంటారు. నేను ఇంక వచ్చేస్తాను... టికెట్ ప్రీపోన్ చేయిస్తాను...’

“ఆవేశపడకు భానూ... ఆలోచించు. మళ్లీ ఇక్కడికి వచ్చి వాళ్లను తల్చుకుని నా పిల్లలు కష్టపడుతున్నారని ఏడుస్తావు. ఆలోచించు. కూల్‌డౌన్...”

“లేదండి... నాకు ఏమీ తోచడంలేదు. ఇక్కడ మాట్లాడేవాళ్లు లేక నేను మాటలే మర్చిపోతానేమో అనిపిస్తోంది.”

‘సరేలే... రాధ లేచాక మాట్లాడు. తనకి ఏమీ ఇబ్బంది లేదు అంటే వచ్చెయ్. నిన్ను వదిలి నేను మాత్రం సంతోషంగా ఉండగలుగుతున్నానా? పిల్లలు ఇబ్బంది పడతారని...పాపాయికి అమ్మమ్మ అవసరం ఉందని తప్ప... నాకు మాత్రం తెలియదా నీకక్కడ పిచ్చెక్కుతుందని...”

“అలాగే... తప్పకుండా మాట్లాడతాను. వచ్చేస్తాను. వీలైతే వచ్చేవారమే బయలుదేరతాను. మీరు జాగ్రత్త. ముందు షేవింగ్‌కి వెళ్లండి. ఇవాళ మన పెళ్లి రోజు కదా బద్ధకించకుండా ఏదన్నా స్వీటు తెచ్చుకుని తినండి. మరి... చూడండి కొత్త బట్టలున్నాయా? కొనుక్కున్నారా... ఒక టీ షర్ట్ అన్నా కొనుక్కుని వేసుకో వచ్చుగా...”

“అలాగే... అవన్నీ మాట్లాడకు. అక్కడ వాళ్లు వింటే బాగుండదు. చూడూ... కన్నీళ్లు తుడుచుకున్నావా? ఎట్టి పరిస్థితుల్లో కూడా నీకు అక్కడ ఉండడం ఇబ్బందిగా ఉందన్న విషయం రాధకి తెలియనీకు సరేనా?”

నాకు మళ్లీ దుఃఖం వచ్చింది. అణచుకుంటూ ‘అలాగే’ అన్నాను కానీ నా కళ్లు వర్షిస్తూనే ఉన్నాయి.

“కాదులే నీ స్వరం నాకు తెలుస్తోంది. నువ్వేడుస్తున్నావ్. కళ్లు తుడుచుకో...”

చిటికెన వేలుతో చెంపల మీదికి జారిన కన్నీళ్లు తుడుచుకుని, ఒక్కసారి కళ్లు గట్టిగా మూసి తెరిచాను. ఇప్పుడు నా కళ్లకు సమానంగా కట్ చేసిన పచ్చిక, గాలికి ఊగుతున్న మొక్కలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గొంతు సవరించు

కుని అన్నాను... "లేదు... ఏడవడం లేదు..."

"ఓకే... మరి ఉండనా? బై... ఒన్స్ అగైన్ హ్యాపీ యానివర్సరీ...'

'థాంక్యూ...' అంటూంటే కను చివరల మిగిలిన రెండు చుక్కలు నా చేతిమీద పడ్డాయి.

"అమ్మమ్మా... ఇక్కడున్నావేంటి? నీ కోసం వెతికా..." అంటూ తలుపు తీసుకుని వచ్చి నా ఒళ్లో వాలిన బంగారుని అయ్యయ్యో పడతావు అంటూ గట్టిగా పట్టుకున్నాను. నా చేతిలో కార్డ్‌లెస్ జారి కిందపడింది.

"అప్పుడే ఎందుకు లేచావురా తల్లీ.. ఇంకా మార్నింగ్ అవలేదు..." అన్నాను ముద్దుపెట్టుకుంటూ.

"నువ్వు నా దగ్గర లేవు. అందుకే లేచా... బజ్జుందాం దా... అంది మత్తుగా వాలిపోతున్న కనురెప్పలు మూసుకుంటూ.

"అలాగే.. వస్తాను పద బజ్జుందాం" అంటూండగా.

"ఏంటమ్మా, ఇంత చలిలో ఇక్కడ కూర్చున్నావు" రాధ కూడా లేచి వచ్చింది.

"ఏంలేదు తల్లీ... మెలకువ వచ్చింది... లేచాను" అన్నాను రాధ చూడకుండా కళ్లు తుడుచుకుంటూ.

"నీకోసం వెతుక్కుంటూ వచ్చి డోర్ కొట్టింది ఇది. నా నిద్ర డిస్టర్బ్ అయింది. కాసేపు పడుకోవచ్చు కదా... వీకెండ్ అప్పుడే లేచి ఏం చేస్తావు? పడుకో" అంటూ ఆవలిస్తూ రాధ బెడ్‌రూమ్ వైపు వెళ్లిపోయింది.

నా ఒళ్లో పడుకుని మళ్లీ నిద్రలోకి జోగుతున్న బంగారు మొహం చూశాను. అమాయకంగా, అందంగా ఉన్న ఆ మొహంలో నా పట్ల కనిపిస్తున్న ప్రేమ, అభిమానం నన్ను వివశురాలిని చేసింది. నా ప్రాణం నా సర్వస్వం. చెంప మీద సున్నితంగా వేళ్లతో తాకి వాటిని పెదాలకు ఆనించుకున్నాను. అందులోంచి వాత్సల్యామృతం నా గుండెల్లోకి జారింది. ఆ పరిష్వంగంలోని మెత్తదనం, వెచ్చదనం నాలో తాత్కాలికంగా మరుగున పడిన మమకారాన్ని వెల్లువలా పైకెత్తి నామీద గుమ్మరిస్తున్న భావన.

'ఇంకాస్త బజ్జుంటా' అంటూ నిద్రలోంచి లేచి నాకోసం వెతుక్కుంటూ వచ్చిన నా చిట్టితల్లిని వదిలి నేనెక్కడకు వెళ్లను? సున్నితంగా రెండు చేతుల మీద ఎత్తుకుని గుండెలకు హత్తుకుంటూ "నిన్నొదిలి ఎక్కడకు వెళ్లగలను తల్లీ! వెళ్లలేను అనుకున్నాను. నిజమే! వెళ్లలేను. అది అనురాగబంధం. ఇది మమతాను బంధం... పేగు బంధం... ఈ బంధానికి నన్ను ఖైదీని చేసే శక్తి ఉంది. కాకపోతే

ప్రేమానురాగాలు పంచుకుని నూరేళ్ల జీవితానికి మేము వేసుకున్న ప్రణాళికల్లో చిన్న మార్పు... నా పిల్లలు ఎంచుకున్న ఈ ఆధునిక జీవన సమరంలో మేము చవి చూస్తున్న చిన్న ఓటమి... అనుకుంటూ లోపలికి నడిచాను.

***

***(ఆగస్టు 2012, ఈవారం)***